# బీఆర్ఎస్‌లోకి కౌన్సిలర్ దంపతులు




- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కేటీఆర్

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల మున్సిపల్ 10వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బొలగం వైష్ణవి, మాజీ బీజేపీ కౌన్సిలర్ బొలగం నాగరాజ్ గౌడ్ దంపతులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం సిరిసిల్ల తెలంగాణ భవన్ లో జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు వీరికి పార్టీ కండువాలను కప్పి బీఅర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. సిరిసిల్ల పదవ వార్డులో బీజేపీ కౌన్సిలర్ గా గత ఐదేళ్ల పాటు పనిచేసిన బోలగం నాగరాజ్ గౌడ్ కు ఇటీవలి మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ పార్టీ టికెట్ ఇవ్వకుండా మొండి చేయి చూపింది. దీనితో నాగరాజ్ గౌడ్ మహిళలకు కేటాయించిన పదవ వార్డులోనే స్వతంత్ర అభ్యర్థిగా తన సతీమణి బోలగం వైష్ణవిని బరిలోకి దించి కౌన్సిలర్ గా గెలిపించుకున్నాడు. అయితే కౌన్సిల్ లో ఏకైక స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన వైష్ణవి తాజాగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా పార్టీ కండువా కప్పుకొని బీఆర్ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి కేటీఆర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు జిందం చక్రపాణి, రాష్ట్ర మహిళా నేత తుల ఉమ, పార్టీ నాయకులు కుంభాల మల్లారెడ్డి, మాన రవి, గుండ్లపల్లి పూర్ణచందర్, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# నేలల సంరక్షణతోనే మేలైన దిగుబడి



- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తాడూరు రైతు వేదికలో ఘనంగా రైతు వారోత్సవాలు

**ప్రజానావ, సిరిసిల్ల:** సాగులో నేలల సంరక్షణ, శాస్త్రీయ ఎరువుల వినియోగం అత్యంత కీలకమని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక"లో భాగంగా తంగళ్లపల్లి మండలం తాడూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతు వారోత్సవాల అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ, ఉద్యానవన, సహకార శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం, సన్న వడ్లు, ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు ఆదర్శ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా రైతు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తమ భూములకు కచ్చితంగా భూసార పరీక్షలు చేయించాలని, నేల స్వభావాన్ని బట్టి ఏ పంటలు వేయాలి, ఎరువులు ఏ మోతాదులో వాడాలనేది అధికారుల సూచనల మేరకు నిర్ణయించుకోవాలని సూచించారు. ఇష్టారీతిన పురుగు మందులు, ఎరువులు వాడటం వల్ల నేల నిస్సారం కావడమే కాకుండా, అటువంటి పంట ఉత్పత్తుల వినియోగంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రైతులు సన్న వడ్ల సాగుపై దృష్టి సారించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, సన్న వడ్లు పండించే రైతులకు ప్రభుత్వం బోనస్ కూడా అందిస్తుందని వివరించారు. దీనికి అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింగం, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన అధికారి శరత్, డీపీఓ షర్ఫుద్దీన్, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# వార్పిన్ కార్మికుల సమ్మె

- పాలిస్టర్ అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం
- కూలి ఒప్పందం కోసం కలెక్టరేట్ వద్ద ధర్నా
- యజమానుల వైఖరిపై సీఐటీయూ ఆగ్రహం





**ప్రజానావ, సిరిసిల్ల:** వార్పిన్ కార్మికుల సమ్మె కారణంగా సిరిసిల్లలోని పాలిస్టర్ అనుబంధ రంగాల కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని సీఐటీయూ అనుబంధ పాలిస్టర్ వార్పిన్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మూషం రమేష్ ఆందోళన వ్యక్తం చేశారు. కూలి అగ్రిమెంట్ డిమాండ్‌పై సోమవారం వార్పిన్ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ముందు ధర్నా చేపట్టారు. అనంతరం తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మూషం రమేష్ మాట్లాడుతూ యజమానులు మొండిగా వ్యవహరించడం వల్ల సమస్య జటిలమవుతోందని విమర్శించారు. వెయ్యి పోగులకు 38 రూపాయల కూలి అడుగుతుండగా, 37 రూపాయలు ఇస్తామని ఒప్పందానికి పిలిచి మళ్ళీ 36 రూపాయలకే పరిమితం చేయడం యజమానుల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ఒక భీముకు రూపాయి పెంచితే నెలకు కార్మికుడికి కేవలం 300 రూపాయలు మాత్రమే పెరుగుతుందని, ఇంత తక్కువ మొత్తం కోసం యజమానులు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. కార్మికులపై కక్ష సాధింపు ధోరణి వీడి, 37 రూపాయల కూలి అగ్రిమెంట్ చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోడం రమణ, సిరిమల్ల సత్యం, శ్రీరామ్ సదానందం, అన్నల్దాస్ గణేష్ సహా పెద్ద సంఖ్యలో వార్పిన్ కార్మికులు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయమే లక్ష్యం

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

### గ్రీవెన్స్ డేలో 19 ఫిర్యాదుల స్వీకరణ



**ప్రజానావ, సిరిసిల్ల:** ప్రజల సమస్యలను నేరుగా విన్నవించుకునేందుకు, బాధితులకు సత్వర న్యాయం అందించే లక్ష్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో బాధితుల నుండి ఎస్పీ స్వయంగా 19 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్లో మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే తమ ప్రధాన ఉద్దేశమని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని, వినతులు స్వీకరించిన తర్వాత అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధితులకు భరోసా కల్పించాలని సూచించారు. గ్రీవెన్స్ డే ద్వారా వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తున్నామని, వాటి పరిష్కార ప్రక్రియను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమర్థవంతమైన సేవలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నేరుగా అధికారుల దృష్టికి సమస్యలను తీసుకురావడం ద్వారా ప్రజలకు త్వరగా న్యాయం జరుగుతుందని ఎస్పీ వెల్లడించారు.



# భీమేశ్వరుని సన్నిధిలో కలెక్టర్ పూజలు

**ప్రజానావ, వేములవాడ:** వేములవాడలో రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయం భీమేశ్వర స్వామివారిని కరీంనగర్ కలెక్టర్ చిత్ర మిశ్రా మంగళవారం సందర్శించారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్ చిత్ర మిశ్రాకు ఆలయ అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో, సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఆమె, అర్చకుల మంత్రోచ్ఛారణల మధ్య అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భీమేశ్వరుని కృపతో జిల్లా ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఆలయ ఏఈఓ జీ అశోక్ కుమార్, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ ఆమెకు స్వామి-అమ్మవార్ల శేషవస్త్రం కప్పి, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

# ముంబైలో షాకింగ్ ఘటన

### తలలో వేటకొడవలి గుచ్చుకుని ఆసుపత్రికి నడిచొచ్చిన యువకుడు

**ప్రజానావ, ముంబై :** ముంబైలో సంచలన ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తుల దాడిలో ఒక యువకుడి తలలో వేటకొడవలి ఇరుక్కుపోయినా, అతడు స్వయంగా సియాన్ హాస్పిటల్‌కు నడుచుకుంటూ చేరాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యారు. యువకుడు తీవ్ర గాయంతో కూడా సాధారణంగా తిరుగుతూ కనిపించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జనగణన శిక్షణ ముగింపు



**ప్రజానావ, జమ్మికుంట:** దేశవ్యాప్తంగా మే 11 నుంచి జూన్ 9 వరకు జరగనున్న జనగణన ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు సోమవారంతో ముగిశాయి. జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో ఈ శిక్షణను ఏర్పాటు చేశారు. ముగింపు రోజున జిల్లా డిప్యూటీ గణాంక అధికారి కిషన్ రావు హాజరై ఎన్యుమరేటర్లకు, సూపర్‌వైజర్లకు ఐడీ కార్డులు, నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జనగణనలో అడిగే 34 ప్రశ్నలకు సంబంధించి సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. జమ్మికుంట రూరల్ మరియు అర్బన్ ప్రాంత ప్రజలు గణన కోసం వచ్చే వారికి సహకరించి సరైన వివరాలు అందించాలని కోరారు. జనగణన ప్రక్రియలో ఉపాధ్యాయులే ప్రధాన వెన్నెముక అని, వారు క్షేత్రస్థాయిలోకి వెళ్లినప్పుడే అపోహలు తొలగిపోతాయని పేర్కొన్నారు. 'లెర్నింగ్ బై డూయింగ్' పద్ధతిలో ఈ బాధ్యతను విజయవంతంగా పూర్తి చేస్తామని ఎన్యుమరేటర్ రాం. రాజయ్య తెలిపారు. ఈ శిక్షణకు రిసోర్స్ పర్సన్లుగా టి. తిరుపతి, కె. భాస్కర్ రెడ్డి వ్యవహరించారు.

# ప్రజావాణి అర్జీలపై దృష్టి సారించాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ప్రజావాణికి 220 దరఖాస్తుల రాక



**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజావాణి అర్జీలపై అధికారులు దృష్టి సారించి, పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 220 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం నుండి డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ఆర్డీఓ లు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ప్రతీ సోమవారం నిర్వహించే డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో కేసులో 20 ఏండ్ల జైలు



**ప్రజానావ, మంచిర్యాల:** ఆరెండ్ల మైనర్ బాలికపై ఓ యువకుడు చేసిన నేరం రుజువై పోక్సో కేసులో 20 ఏండ్ల జైలు శిక్షకు గురయ్యాడు. రూ. 10 వేలు జరిమానా,బాధితురాలికి రూ. 200000 లక్షల పరిహారం డీఎల్ఎస్ ద్వారా ఇవ్వాలని కోర్టు ఉత్తర్వు ఇచ్చింది. కేసు పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. బెల్లంపల్లి పట్టణం బాబు క్యాంపు కు చెందిన బండ సాయికృష్ణ 2020 తేదీ 21న మధ్యాహ్నం తన పిల్లలతో ఆడుకోవడానికి ఇంటికి వచ్చిన మైనర్ బాలికను ఇంట్లోకి తీసుకువెళ్ళి గదిలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. సదరు బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్ళి జరిగిన విషయం తల్లికి చెప్పింది. బాధితురాలి తల్లి బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఇన్స్పెక్టర్ బి.రాజు కేసు నమోదు చేశారు. మంచిర్యాల ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ జడ్జి కోర్టు కేసు విచారణ చేసింది. లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్ ఇరువురి వాదనలు జడ్జి విన్నారు. ముద్దాయి పై నేరం రుజువు కావడతో జడ్జి 20 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, రూ. 10,000 జరిమానా విధించారు. బాధితురాలికి రూ. 2,00000 లక్షలు కాంపెన్సేషన్ ఇప్పించాలని ఀూూా ను ఆదేశించారనీ బెల్లంపల్లి వన్ టౌన్ ఎస్సై శ్రీనివాస్ రావు తెలిపారు.

# రైతు వారోత్సవాలు



**ప్రజానావ, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని రైతు వేదికలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక భాగంగా వ్యవసాయ అధికారి శ్రీధర్ ఆధ్వర్యంలో వానకాలం పంటల సాగుకు రైతులకు అవగాహన కల్పించడం ఆధునిక పద్ధతులు డ్రోన్లు వినియోగం నేల ఆరోగ్యంపై గ్రామస్థాయి సదస్సులు నిర్వహిస్తున్నారు అని తెలిపారు ఈ రైతు వారోత్సవాల. ముఖ్యంగా వానకాలం సాగుకు రైతులను సన్నద్ధం చేయడం ఆధునిక వ్యవసాయ పద్ధతులు నేల సంరక్షణ మరియు సస్యరక్షణ చర్యలు మార్కెటింగ్ రుణ సదుపాయాల పై అవగాహన కల్పించడం జరుగుతుందని .. తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఈవోలు చంద్రశేఖర్ శిరీష నసీమా వివిధ గ్రామాల రైతుల పాల్గొన్నారు.

# ఉపాధి పనుల్లో అక్రమాలకు తావు లేదు



**ప్రజానావ, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల పరిధిలోని దూదియాతండ గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నింబదనల మేరకు ఉపాధిహామీ పనులు ఛేయాలని, ప్రతి రోజు పనులు ప్రారంభం, ముగింపు సమయంలో ఎస్ఆర్ఎస్ తీయాలని సూచించారు. కూలీలకు రాని వారు పేర్లు మస్టర్లలో నమోదు చేస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు.

# ప్రభుత్వ కృషి అభినందనీయం

## ఓబీసీ మోర్చా డీఎన్‌టీ సెల్ రాష్ట్ర ఇన్‌చార్జి కుమార్ మహేంద్ర

**ప్రజానావ, హైదరాబాద్:** రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలు, సంచార జాతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని ఓబీసీ మోర్చా డీఎన్‌టీ సెల్ రాష్ట్ర ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర సమన్వయకర్త, మెదరి మహేంద్ర సంఘం నేత కుమార్ మహేంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల పర్యటనలు నిర్వహిస్తూ అణగారిన వర్గాల సమస్యలను నేరుగా వినడం, అవమానకర కుల పేర్ల తొలగింపు వంటి అంశాలపై చర్యలు తీసుకోవడం, అర్హత కలిగిన సంచార జాతులను సంక్షేమ పథకాల పరిధి లో చేర్చే విధంగా సంస్కరణలను సిఫార్సు చేయడం ప్రభుత్వం సామాజిక బాధ్యత ను ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. ఈ సిఫార్సులకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం ల భించడం ద్వారా అనేక వర్గాలకు గౌరవం, సమానత్వం కల్పించే దిశగా చారిత్రా త్మక ముందడుగు పడిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయాలు సామాజిక సామరస్యాన్ని పెంపొందించడంలో కీలకంగా నిలుస్తాయని, అణగారిన వర్గాల సాధికారతకు దోహదం చేస్తాయని అన్నారు. ఓబీసీ మోర్చా డీఎన్‌టీ సెల్ తరఫున ఈ కార్యక్ర మాలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని, వెనుకబడిన, సంచార వర్గాల సమగ్ర అభ్యున్నతికి నిరంతరం సహకరిస్తామని కుమార్ మహేంద్ర హామీ ఇచ్చారు.

# రచయిత పెద్దింటికి ఎస్‌జీ ఫౌండేషన్ కథా పురస్కారం



**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా భీముని మల్లారెడ్డిపేటకు చెందిన ప్రముఖ సినీ కథా ర చయిత పెద్దింటి అశోక్ కుమార్‌కు ఎస్‌జీ ఫౌం డేషన్ కథా పురస్కారం లభించింది. ఈ విషయాన్ని ఫౌండేషన్ చైర్మన్ పి. శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితో పాటు ఈ అవార్డును అందజేస్తారు. సాహిత్య రంగంలో విశిష్ట కృషి చేసిన పెద్దింటి అశోక్ కుమార్ ఇప్పటి వరకు సుమారు 300 కథలు, 7 నవలలు, 5 నాటికలు రచించారు. 12 కథా సంకలనాలను ప్రచురించి సాహిత్య ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపును పొందారు. అంతేకాకుండా, పది సినిమాలకు రచనలను అందించారు. ప్రస్తుతం కూడా చిత్రరంగంలో మాటలు, కథలు, పాటలు అందిస్తున్నారు. కథా సాహిత్యంలో చేసిన కృషికి గుర్తింపుగా పెద్దింటికి ఈ పురస్కారం లభించడం విశేషం.

# వేధింపుల అధికారిపై వేటు

## కలెక్టర్ దృష్టికి మహిళా ఉద్యోగుల వేధింపుల కేసు

### డీసీపీవో ఎం హరీష్‌ను సర్వీస్ నుండి రిమూవ్ చేసిన జగిత్యాల జిల్లా కలెక్టర్

- లోకల్ కంప్లెయింట్స్ కమిటీ విచారణలో ఆరోపణలు నిజమని నిర్ధారణ
- షోకాజ్, హెచ్చరికలు ఫలించకపోవడంతో కలెక్టర్ కఠిన నిర్ణయం
- రికార్డులు, బాధ్యతలు వెంటనే అప్పగించాలని స్పష్ట ఆదేశాలు



**ప్రజానావ, జగిత్యాల :** 'ఎట్టకేలకు వేధింపుల అధికారిపై వేటుపడింది'.! జిల్లా పరిపాలనలో మహిళా ఉద్యోగుల భద్రత, వృత్తి నైతికతపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లా శిశు సంరక్షణ యూనిట్ (డిసిపియు)లో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డిసిపిఓ)గా పనిచేస్తున్న ఎం. హరీష్‌పై వచ్చిన తీవ్ర ఆరోపణలు నిజమని తేలడంతో ఆయన సేవలను తక్షణం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### కలెక్టర్ ఉత్తర్వులు - కాంట్రాక్టు రద్దు.

జగిత్యాల కలెక్టర్ కార్యాలయం నుంచి విడుదలైన Procdgs.Rc.No.A..Estt.146/2025,తేదీ 01.05.2026 ప్రకారం ఎం. హరీష్‌ను 17.03.2025న శుద్ధ కాంట్రాక్టు ప్రాతిపదికన డీసీపీవోగా నియమించారు. అయితే ఆయనపై వచ్చిన పలు ఫిర్యాదులను పరిశీలించిన లోకల్ కంప్లెయింట్స్ కమిటీ (ఎల్సీసీ) సమగ్ర నివేదిక సమర్పించింది. ఆ నివేదికలో పేర్కొన్న అంశాలను గమనించిన కలెక్టర్ తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్ధారించారు. పరిపాలనా నైతికతకు విరుద్ధంగా వ్యవహరించినట్లు స్పష్టంగా తేలడంతో సేవలను కొనసాగించడం సాధ్యం కాదని భావించారు. కాంట్రాక్టు ఉద్యోగం తాత్కాలిక స్వభావం కలిగి ఉండటం కూడా నిర్ణయానికి కారణమైంది. నివేదిక ఆధారంగా తక్షణమే సేవలు రద్దు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వచ్చేలా స్పష్ట ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత శాఖలకు సమాచారాన్ని చేరవేసి అమలు ప్రక్రియ వేగవంతం చేశారు. జిల్లాలో పరిపాలనా క్రమశిక్షణకు ఇది ఉదాహరణగా నిలుస్తోంది.

### మహిళా ఉద్యోగులపై వేధింపులు - ప్రధాన ఆరోపణలు

హరీష్‌పై మహిళా ఉద్యోగులను పని స్థలంలో పదేపదే వేధించడం, వివక్షాత్మక ప్రవర్తన ప్రదర్శించడం వంటి తీవ్రమైన ఆరోపణలు నమోదయ్యాయి. అధికార దుర్వినియోగం చేస్తూ ఉద్యోగులను ఒత్తిడికి గురిచేసినట్లు విచారణలో బయటపడింది. హాజరు రికార్డులను మానిప్యులేట్ చేయడం వంటి చర్యలు కూడా గుర్తించారు. ఔట్‌రీచ్ వర్కర్ (మహిళ)ను ఆమె సామర్థ్యానికి మించిన సోషల్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ పనులు చేయాలని ఒత్తిడి చేసినట్లు వెల్లడైంది. కాంట్రాక్టు పునరుద్ధరణ రద్దు చేస్తానని బెదిరింపులకు దిగిన అంశం కూడా నిర్ధారితమైంది. ఉన్నతాధికారులతో తనకు సంబంధాలు ఉన్నాయని చెప్పి ఉద్యోగులను భయపెట్టినట్లు నివేదికలో పేర్కొన్నారు. మిషన్ వత్సల్య మార్గదర్శకాలకు విరుద్ధంగా బాధ్యతలు అప్పగించడం కూడా ఆరోపణల్లో భాగమైంది. ఈ చర్యలు ఉద్యోగ వాతావరణాన్ని ప్రతికూలంగా మార్చినట్లు తేలింది. మహిళా సిబ్బంది భద్రతకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించినట్లు స్పష్టం అయింది. మొత్తం మీద వృత్తి నైతికతకు విరుద్ధంగా ప్రవర్తించినట్లు నిర్ధారణకు వచ్చింది.

### హెచ్చరికలు, షోకాజ్ తర్వాత కూడా 'నో-మార్పు'.

ఇప్పటికే 12.03.2025న హరీష్‌కు అధికారుల నుంచి స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. వృత్తి ప్రవర్తనలో మార్పు తీసుకురావాలని సూచించినప్పటికీ ఆ సూచనలు అమలు కాలేదు. ప్రవర్తనలో మార్పు కనిపించకపోవడంతో 20.04.2026న షోకాజ్ నోటీసు జారీ చేశారు. దీనికి స్పందిస్తూ హరీష్ 23.04.2026న ప్రతినిధ్యం సమర్పించారు. అనంతరం 30.04.2026న మరింత వివరణ ఇచ్చారు. అయితే సమర్పించిన వివరణలు అధికారులను సంతృప్తిపరచలేకపోయాయి. సమగ్రంగా పరిశీలించిన తర్వాత అవి సరిపోవని తేల్చారు. అదే సమయంలో ఎల్సీసీ నివేదికలోని అంశాలు కూడా తీవ్రతను స్పష్టం చేశాయి. హెచ్చరికలు, షోకాజ్ ప్రక్రియలు పూర్తి అయినప్పటికీ మార్పు రాకపోవడం నిర్ణయాన్ని కఠినతరం చేసింది. పరిపాలనా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం తప్పనిసరి అయింది. దీంతో తుది నిర్ణయంగా సేవల రద్దు వైపు అడుగులు వేశారు.

### చట్టపరమైన నిర్ధారణ - ఎల్సీసీ నివేదిక కీలకం

01.05.2026న లోకల్ కంప్లెయింట్స్ కమిటీ సమర్పించిన నివేదిక ఈ కేసులో కీలకంగా మారింది. ఆ నివేదికలో హరీష్ చర్యలు 'మహిళల వద్ద వేధింపుల నివారణ, నిషేధం-పరిహార చట్టం, 2013' పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. చట్టపరమైన ప్రమాణాల ప్రకారం విచారణ నిర్వహించబడినట్లు అధికారులు పేర్కొన్నారు. సాక్ష్యాలు, బాధితుల వాంగ్మూలాలు, పత్రాలు అన్ని పరిశీలించబడ్డాయి. విచారణ ప్రక్రియ పారదర్శకంగా జరిగినట్లు నిర్ధారించారు. మహిళా ఉద్యోగుల హక్కులను కాపాడేందుకు ఈ చట్టం అమలు చేయడం అత్యంత ముఖ్యమని భావించారు. చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం తప్పనిసరి పరిస్థితిగా మారింది. ఎల్సీసీ నివేదికలోని నిర్ధారణలు నిర్ణయానికి బలాన్ని ఇచ్చాయి. ఈ నివేదిక ఆధారంగా తక్షణ చర్యలు తీసుకోవడం జరిగింది. చట్టబద్ధతకు ప్రాధాన్యం ఇచ్చిన పరిపాలనగా ఇది నిలిచింది. మహిళా భద్రతపై రాజీ లేదని ఈ చర్య స్పష్టం చేసింది.

### కాంట్రాక్టు నిబంధనల ఉల్లంఘన - తక్షణ చర్య

హరీష్‌తో కుదుర్చుకున్న కాంట్రాక్టు ఒప్పందంలోని పలు క్లాజ్‌లను ఉల్లంఘించినట్లు తేలింది. క్లాజ్ (1) ప్రకారం నియామకం తాత్కాలికమైనదిగా ఉండటంతో ఎప్పుడైనా రద్దు చేసే అధికారం ఉంది. క్లాజ్ (vii) ప్రకారం వృత్తి ప్రవర్తన, క్రమశిక్షణ పాటించాల్సిన బాధ్యత ఉంది. క్లాజ్ (i.) ప్రకారం వర్క్‌ప్లేస్ హరాస్‌మెంట్ జరిగితే తక్షణమే చర్యలు తీసుకోవచ్చు. ఈ మూడు ప్రధాన నిబంధనలను అతిక్రమించినట్లు నిర్ధారణకు వచ్చింది. కాంట్రాక్టు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం పరిపాలనకు తప్పనిసరి అయింది. క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రవర్తించిన ఉద్యోగిపై సడలింపు ఇవ్వలేమని అధికారులు స్పష్టం చేశారు. పరిపాలనా నియమాలను కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని భావించారు. ఈ నేపథ్యంలో తక్షణం సేవలను రద్దు చేశారు. కాంట్రాక్టు ఉల్లంఘనకు ఇది ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచింది. తద్వారా ఇతరులకు కూడా హెచ్చరికగా మారింది.

### రికార్డులు అప్పగింత - తదుపరి ఏర్పాట్లు

హరీష్ తన వద్ద ఉన్న అన్ని అధికారిక రికార్డులు వెంటనే అప్పగించాలని ఆదేశించారు. ఫైళ్లు, డాక్యుమెంట్లు, కీలు మరియు ప్రభుత్వ ఆస్తులను జిల్లా వెల్ఫేర్ అధికారి (డబ్ల్యూడి & సిడబ్ల్యూ), జగిత్యాలకు అప్పగించాల్సిందిగా సూచించారు. కార్యాలయ కార్యకలాపాలు నిలిచిపోకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖలకు సమాచారం అందజేసి తదుపరి ఏర్పాట్లు చేపట్టారు. డైరెక్టర్, డబ్ల్యూడి & సిడబ్ల్యూ శాఖ, తెలంగాణకు నివేదిక పంపించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు కూడా వివరాలు అందించారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి (ఎల్సీసీ చైర్మన్)కు సమాచారం చేరవేశారు. ఖాళీ అయిన పదవికి తాత్కాలిక బాధ్యతలు అప్పగించే ప్రక్రియ ప్రారంభించారు. కార్యాలయ పనితీరు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. బాధ్యతల బదిలీ వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. పరిపాలనా వ్యవస్థ సజావుగా నడవడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

### జగిత్యాల జిల్లాలో చర్చనీయాంశం - కలెక్టర్ కఠిన వైఖరి స్పష్టం.!

ఈ ఘటన జగిత్యాల జిల్లాలో విస్తృత చర్చకు దారితీసింది. మహిళా ఉద్యోగుల భద్రతపై ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన వైఖరి స్పష్టమైంది. పరిపాలనలో నైతిక విలువలకు ప్రాధాన్యం పెరుగుతున్న సంకేతం ఇది. తప్పు చేసిన వారిపై ఎలాంటి సడలింపు ఉండదని స్పష్టం చేశారు. మహిళా సిబ్బంది రక్షణకు ఇది ఒక బలమైన సందేశంగా మారింది. ఉద్యోగ వాతావరణం సురక్షితంగా ఉండాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేసింది. ఇతర శాఖలలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు వెలువడుతున్నాయి. ఈ నిర్ణయం ఇతర ఉద్యోగులకు హెచ్చరికగా నిలుస్తోంది. న్యాయం జరిగిందనే భావన బాధితుల్లో కలుగుతోంది. పరిపాలనా వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోంది. మహిళల గౌరవం, భద్రతకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు.

# డిప్యూటీ సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

## జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే

## గంభీరావుపేటలో హెలిప్యాడ్ పరిశీలన

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో మంగళవారం ఉప ముఖ్యమంత్రి, మంత్రుల బృందం పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు. ఈ పర్యటనను పురస్కరించుకుని గంభీరావుపేటలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, ఇతర భద్రతా చర్యలను ఎస్పీ సోమవారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. వీఐపిల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని ఆయన సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో భాగంగా ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, ఎల్లారెడ్డిపేట సిఐ వెంకటేష్, స్పెషల్ బ్రాంచ్ సిఐ రవి, ఆర్ఐలు మధుకర్, రమేష్, ఎస్ఐ అనిల్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా యంత్రాంగం మరియు పోలీస్ శాఖ సమన్వయంతో పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.



# ఫిలింనగర్‌లో బీజేపీ కీలక నేతల సమావేశం

**ప్రజానావ, ఖైరతాబాద్:** ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఫిలింనగర్ డివిజన్ పరిధిలోని మాగంటి కాలనీలో సోమవారం బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 10న పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో బీజేపీ సాధించిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పరస్పరం మిఠాయిలు పంచుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బహిరంగ సభ ఇన్‌చార్జిగా ఉన్న హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కుంబాల గంగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకట్ స్వామి, ఫిలింనగర్ డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లెపు శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల గణేశ్ యాదవ్, ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేవైఎం కన్వీనర్ దండగుల శేఖర్‌తో పాటు సీనియర్ నాయకులు మేకల లక్ష్మయ్య యాదవ్, బోయ రామాంజనేయులు, వుట్ల శశిశేఖర్, మల్లికార్జున్ గౌడ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి దొంగరి రాజకీయ, తదితరులు పాల్గొన్నారు.



